# గురువును మించిన శిష్యుడు



*భాండం భిత్వాచ భర్తారం*
*చండికా యాచతే ధనం*
*అహో గుణవతీ భార్యా*
*భాండ మూల్యం నయాచతే*

*భావం:* కుండను పగలగొట్టి కోపిష్టి అయిన ఈమె భర్తను డబ్బు అడుగుతోంది. ఆహా నా భార్య ఎంత గుణవంతురాలు, కుండ ఖరీదును ఎప్పుడూ అడగదు.

రాజధానిలో ప్రసిద్ధి చెందిన గురుకులమది. ఆ గురుకులంలోని ఆచార్యులు సర్వ శాస్త్ర పారంగతులు. విద్యార్థులకు ఎంతో చక్కగా చదువుచెప్పేవారు. ఎందరో ఆయన దగ్గర చదువుకుని పండితులుగా పేరు సంపాదించారు. రాజాస్థానంలో ఆయనకు చాలా మర్యాద జరిగేది. దేశ విదేశాలనుండి ఎందరో ఆ గురుకులంలో విద్యాభ్యాసానికి వచ్చేవారు.

కానీ ఏం లాభం? ఇంట్లో ఈగలమోత, బయట పల్లకీ మోత అన్నట్లుగా ఆయన సంసార జీవితముండేది. గురువుగారి భార్య పరమ గయ్యాళి. సభలలో తన ప్రసంగాలతో, వాదనా కౌశలంతో, వాక్పటిమతో అందరినీ మెప్పించే ఆయన ఇంట్లో నోరు విప్పేవారు కాదు. ఆయన ఏమీ అనకుండానే తిట్టిన తిట్టుతిట్టకుండా గంటల తరబడి తిట్టగల శక్తి ఆ మహిళామణికుంది. ఊర్లో అందరికీ విషయం తెలిసినా ఆయన మీద గౌరవంతో ఎవరూ ఆవిడ సంగతి ఎత్తేవారు కాదు.

ఒకరోజు గురువుగారు భోజనం చేస్తున్నారు. భార్య దూషణ కార్యక్రమం ప్రారంభించింది. "నీటికి నాచు తెగులు, మాటకు మాట తెగులు" అనుకుని ఆయన మాట్లాడలేదు. "అలా నోరు మూసుకు కూచున్నారు. నా మాట లెక్కలేదు" అంటూ ఆవిడ వేడి పులుసుతో ఉన్న కుండ తెచ్చి ఆయన నెత్తిమీద పడేసింది. కుండ బద్దలైంది. వేడి పులుసుతో ఆయన ఒళ్ళు కాలిపోయింది.

శాంత స్వభావుడైన గురువుగారికి మొదటిసారిగా కోపం వచ్చింది. ఇక ఈవిడతో కాపురం చెయ్యలేననుకుని ఇంటినీ, ఊరినీ వదిలేసి వెళ్ళిపోయాడు. సత్రం భోజనం, మఠం నిద్రగా పయనిస్తున్న ఆయనకి ఒక గ్రామంలో శిష్యుడు కన్పించాడు. ఆయనకు నమస్కరించి "గురువుగారూ, చెరువులో స్నానం, సంధ్యా పూర్తిచేసుకుని రండి. మా ఆవిడ మీకు పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం పెడుతుంది" అన్నాడు. గురువుగారు సరేనన్నారు.

శిష్యుడు ఇంటికి వెళ్ళి భార్య కాళ్ళు పట్టుకుని గురువుగారి ముందు మాట దక్కించమన్నాడు చక్కగా వండి వడ్డించి వినయం చూపితే పట్టు చీరా, వజ్రాల దుద్దులూ కొంటానన్నాడు. భార్య పది తప్పులవరకూ కాస్తానంది.

గురువుగారు స్నానం చేసి వచ్చాక గురుశిష్యులిద్దరూ భోజనానికి కూచున్నారు. శిష్యుడి భార్య నెమ్మదిగా వచ్చి పదార్థాలు వడ్డించింది. శిష్యుడు పప్పు అన్నంలో కలుపుకుని మొదటి ముద్ద నోట్లోపెట్టుకుని "ఉప్పు తక్కువ తగలేశావు" అన్నాడు. ఆవిడ "క్షమించండి" అంటూ కొద్దిగా ఉప్పు తెచ్చి

అరిటాకులో వేసింది. "గురువుగారికి రెండు గారెలే వేశావేమిటి? దాచుకు మింగుదామనుకున్నావా? నాలుగు పట్రా" అన్నాడు.ఆమె జాగ్రత్తగా తెచ్చి ఆకులో వేసింది. "అల్లం పచ్చడేనా? నువ్వుల పచ్చడి చెయ్యమన్నాకదా. మర్చిపోయావా దేభ్యం మొహమా" అన్నాడు. "లేదండీ. రెండు పచ్చళ్ళూ చేశాను" అంటూ ఆమె తెచ్చింది.

శిష్యుడి భార్య వినయానికి గురువుగారిలో ఆశ్చర్యమూ, కించిత్తు అసూయా కలిగాయి. భార్య వినయానికి శిష్యుడు రెచ్చిపోయి కేకలేశాడు. ఆమె తల వంచుకుని వడ్డన చేసింది. శిష్యుడికి ఒళ్ళూ పయి తెలియక అరుపులు ఎక్కువ చేశాడు. భార్య దృష్టిలో పది తప్పులూ పూర్తయ్యాయి. "గడకర్రలా నిల్చున్నావేంటి? పులుసు పట్రాపో" అన్నాడు. ఆమె లోపలకు వెళ్ళి వేడి పులుసు కుండ తెచ్చి భర్త నెత్తిమీద కొట్టింది. కుండ బద్దలైంది. వేడి పులుసుతో శిష్యుడి ఒళ్ళు కాలింది.

ఒళ్ళు కాలి, లబోదిబోమని ఏడుస్తున్న శిష్యుడితో అతడి భార్య "నిక్షేపం లాంటి కుండ నీవల్ల పగిలిపోయింది. కొత్త కుండ కొనాలి. డబ్బులియ్యి" అంది.

గురువుగారు "కోపంతో కుండ బద్దలుకొట్టింది చాలక డబ్బుకూడా అడుగుతోంది. ఆహా నా భార్య ఎంత మంచిది. కుండ తనే కొనుక్కుంటుంది. కానీ ఖరీదిమ్మనదు'' అనుకున్నాడు. గురువుని మించిన శిష్యుడుంటే గురుపత్నిని మించిన శిష్యపత్ని ఉండదా?!!

******